క్లుప్తంగా

పది విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు


పరీక్ష ఫీజు అందజేస్తున్న దాత

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 10 మంది పేద విద్యార్థులకు రవ్వవరపు ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో పరీక్ష ఫీజు నగదును మంగళవారం ప్రధానోపాధ్యాయుడు అంజయ్యకు అందజేశారు. గత కొంతకాలంగా అకాడమీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. కార్యక్రమంలో అకాడమీ సభ్యులు రవ్వవరపు శ్యామ్, ముప్పా నారాయణరావు పాల్గొన్నారు.

పంచాయతీ ప్రణాళికలపై 15న శిక్షణ

బల్లికురవ: ప్రజా పంచాయతీ ప్రణాళికాభివృద్ధి, మండల అభివృద్ధి, సమగ్ర కార్యాచరణ పై ప్రణాళికలు తయారు చేసేందుకు 2025–26 సంవత్సరానికి శుక్రవారం స్థానిక కార్యాలయంలో శిక్షణా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా జరిగే శిక్షణకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ప్రభుత్వ భూముల తనిఖీ


ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ గ్లోరియా

పర్చూరు (చినగంజాం): మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను బాపట్ల ఆర్డీవో పీ గ్లోరియా మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ భూముల వివరాలను ఆమె సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ బ్రహ్మయ్య, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వో శిరీష, మండల సర్వేయర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

నూతన ఏవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన మేరిమ్మ

యద్దనపూడి: మండల వ్యవసాయశాఖ అధికారిగా ఎన్ మేరిమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అద్దంకి వ్యవసాయ శాఖ టెక్నికల్ అధికారిగా పనిచేసి బదిలీపై ఆమె యద్దనపూడి వ్యవసాయాధికారిగా వచ్చారు. గతంలో వ్యవసాయాధికారిగా పనిచేసిన చల్లగుండ్ల ఆదినారాయణ బదిలీపై గుంటూరు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు వ్యవసాయ శాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కట్టరు.. ముందుకు వెళ్లరు!


గుంటుపల్లిలో నత్తనడకలో ల్యాబోరేటరీ యూనిట్ భవనాలు


పంగులూరులో నత్తనడకలో ల్యాబోరేటరీ భవనం

- నత్తనడకలో బీపీహెచ్‌యూ యూనిట్ల భవనాలు
- నిర్మాణ దశలోనే ఉన్న వైనం
- కప్పుదశల్లో భవనాలు
- అసౌకర్యాల మధ్య రోగులు, సిబ్బంది
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

బల్లికురవ: గత ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. కాని నేడు కూటమి ప్రభుత్వంలో అన్ని శాఖలు భ్రష్టుపట్టిపోయాయి. మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్పిన కూటమి నాయకులు కేవలం తప్పుడు వార్తలతో, కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని గాలికొదిలేసి ప్రైవేటు పరం చేసేందుకు సన్నద్ధం అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబోరేటరీ, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హెల్త్ మిషన్ ద్వారా 20 మాసాల క్రితం ఒక్కో పీహెచ్‌సీకి రూ.50 లక్షల నిధులు కేటాయించింది. అప్పటి నుంచి పనులు చురుకుగా సాగాయి. కాని దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో బిల్లులు మంజూరులో జాప్యం చేసింది. దీంతో భవనాలకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు పనులను నత్తనడకలోనే సాగుతున్నాయి. బల్లికురవ, జే పంగులూరు, యద్దనపూడి, వేటపాలెం, మండలాల్లోని బీపీహెచ్‌యూలో భవనాల కొరత ఉండటం వల్ల రోగులు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘ హెల్త్ గ్రాంటులో మంజూరైన ఈ పనులు సకాలంలో పూర్తయి ఉంటే ల్యాబోరేటరీతోపాటు, పబ్లిక్ హెల్త్ యూనిట్ ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందుతాయి. ఇందులో పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి రూ.20 లక్షలు, పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీకి రూ.20 లక్షలు, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం (హెచ్‌ఎంఐఎస్) యూనిట్‌కు రూ.10 లక్షలు మంజూరు చేసింది.

కొప్పరపాడు బీపీహెచ్‌యూ స్థల సేకరణలో జాప్యం..

ఈ పరిస్థితులు ఇలా ఉంటే బల్లికురవ మండలానికి రెండో పీహెచ్‌సీ కొప్పరపాడుకు మంజూరై రెండు సంవత్సరాలు అయింది. ఇరువురు వైద్యులు సిబ్బందిని కేటాయించినా రెవెన్యూ అధికారులు స్థల సేకరణలో జాప్యంతో భవనాల నిర్మాణం అటకెక్కింది. అప్పట్లో భవనాల నిర్మాణానికి రూ.కోటి నిధులు కూడా మంజూరు చేసింది. బల్లికురవ మండలంలోని 21 పంచాయితీలు, 15 శివారు గ్రామాల్లోని ప్రజలు గుంటుపల్లి పీహెచ్‌సీకి రావాలంటే దూరం పెరిగి వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కొప్పరపాడులో పీహెచ్ ఏర్పాటుతో వైద్యం అందిస్తే 15 గ్రామాలకు ఇబ్బంది తొలగుతాయి.

భవనాల నిర్మాణం పూర్తి చేయాలి..



బీపీహెచ్‌యూలో యూనిట్ల ఏర్పాటుకు భవనాలు మంజూరై 20 నెలలవుతున్నా పనులు నత్తనడకతోనే జరుగుతున్నాయి. కొప్పరపాడుకు రెండో సీహెచ్‌సీకి మంజూరైన స్థలం కేటాయింపులో జాప్యంతో వైద్యం అందక పేదలు ఇబ్బందుపడుతున్నారు.

– తంగిరాల వెంకటేశ్వర్లు, సీపీం కార్యదర్శి

అదనపు భవనాలు పూర్తిచేయాలి..



పీహెచ్‌సీలకు మంజూరైన అదనపు భవనాల యూనిట్లను తక్షణమే పూర్తి చేసి అప్పగించాలి. వైద్యశాలలో చాలీచాలని భవనాలతో ల్యాబోరేటరీ, పబ్లిక్ హెల్త్ యూనిట్‌లు నిర్వహించటం ఇబ్బందిగా ఉంటుంది.

– వెంకటరామిరెడ్డి, పీ. తక్కెళ్లపాడు

కొప్పరపాడులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి.



మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలమవారిపాలెం, జమ్ములమడక, కొత్తూరు, కూకట్లపల్లి, యానాది సంగం, అరుణగిరి వాసులకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. కొప్పరపాడుకు మంజూరైన పీహెచ్‌సీని అద్దె భవనంలోనైనా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి.

– టీ నరేష్, వెలమవారిపాలెం

కదలని మురుగు.. వదలని రోగాలు


వేటపాలెంలో పేరుకు పోయిన చెత్త దిబ్బ


ఈపురుపాలెం బైపాస్ వద్ద పడేసిన వ్యర్థాలు

- వేటపాలెం, చీరాలలో కనిపించని పారిశుద్ధ్యం
- డ్రైనేజీలో కదలని మురుగు నీరు
- ప్రజలను వేధిస్తున్న దోమల బెడద

వేటపాలెం: అసలే రోగాల సీజన్ దానికి తోడు అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో ప్రజలు రోగాలతో అల్లాడిపోతున్నారు. అటు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఏ ఇల్లు చూసినా డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో బాధపడుతున్నారు. ముఖ్యంగా చీరాల, వేటపాలెం మండలాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుతం వర్షాకాలం ఓవైపు, సీజన్ వ్యాధులు ఒక వైపు ప్రజలను వేధిస్తున్నాయి. ఈగలు, దోమల స్వైరవిహారంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దోమకాటు కారణంగా జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. వేటపాలెం పంచాయతీ పరిధిలో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండటం, కాలువల్లో రోజుల


వేటపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మురుగు కాల్వలో నిలిచి ఉన్న నీరు

తరబడి నీరు నిల్వ ఉండటంతో అందులో దోమలు అవాసాలుగా మార్చుకుంటున్నారు. దీనికి తోడు పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. వార్డులో పారిశుద్ధ్య పనులతో పాటు రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దుల సమస్యతో ప్రజలు అవస్థలు..

వేటపాలెం–దేశాయిపేట పంచాయతీ గ్రామాలు రెండు కలసి ఉంటాయి. అయితే రెండు గ్రామాలు సరిహద్దు రోడ్డులో వర్షం నీరు, చెత్త దిబ్బలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు మీద నిలిచిన మురుగు నీరు నెలల తరబడి రోడ్డు మీదనే ఉండి పోతుంది. ఈ నిల్వ ఉంచిన చెత్త దిబ్బలు, మురుగు కాల్వల్లో నిలచిన వర్షం నీటిలో దోమలు పెరిగిపోయి రోడ్డుకి ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో చెత్తపేరుకు పోయి, వర్షనీరు నిల్చిపోయి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు కల్పించుకొని చర్యలు చేపట్టకపోతే మరింత రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దోమల బెడద ఎక్కువైంది..

వర్షాకాలం ఈగలు, దోమలు బెడద ఎక్కువైంది. మురుగు కాల్వల్లో మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మురుగు నీటి నుంచి వచ్చే దోమలతో రాత్రి, పగలు నిద్ర లేకుండా పోతోంది. అధికారులకు దృష్టికి సమస్యను పదులసార్లు తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు.

– కోటేశ్వరరావు, వేటపాలెం

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల సెక్రటరీలు, మండల స్థాయి అధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని, గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ గ్రామంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలు, ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, నిర్ణీత సమయాల్లో పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులును ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఎంఈవో సుబ్రమణ్యం, ఏఈ నాగరాజు, పంచాయతీల సెక్రటరీలు మురళీబాపూజీ, శ్రీను, మాధవి, ఇమ్రాన్, గౌసియా, వీఏఓలు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.


సమావేశంలో సూచనలందిస్తున్న ఎంపీడీవో శివసుబ్రమణ్యం

వైభవంగా శుద్ధ ఏకాదశి పూజలు


కారంచేడు శివాలయంలో శుద్ధ ఏకాదశి పూజల్లో భక్తులు


చీరాల వీరరాఘవస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: కార్తీకమాసం రెండో మంగళవారం, శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం కారంచేడు పెద బజారు శివాలయంతో పాటు, గోపాలస్వామి గుడిలో భక్తులు పెద్దఎత్తున వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ, వేదాంతం కిరణ్‌కుమార్‌లు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చీరాల అర్బన్: చిలుకు ఏకాదశి సందర్భంగా మంగళవారం వీరరాఘవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, లక్షదీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి చిన్ని కృపారావు పర్యవేక్షించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అర్చకులు వెంకట రంగాచార్యులు, చెన్న కృష్ణమాచార్యులు ఏకాదశి విశిష్టతను వివరించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

పీఎం సూర్యఘర్ యోజనతో ఉపయోగాలు

చీరాల అర్బన్: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై మంగళవారం స్థానిక ఎన్‌పీఎస్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్ఈ, చీరాల ఈఈ జాన్ థామస్ హాజరయ్యారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంతో ప్రతి ఇంటిపై సుమారు 35 శాతం ప్రభుత్వ రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఇళ్లపై ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ బిల్లు తక్కువగా వస్తుందన్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇస్తుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంపై సోలార్ ప్లేట్ల కంపెనీల ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, పర్చూరు డీఈఈలు బి.హరిప్రసాదరావు, శ్రీనివాసులు, ఎన్.రమేష్‌బాబు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ జాన్ థామస్

వైద్యురాలి తీరుపై జర్నలిస్టుల ఆందోళన


సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చీరాల రూరల్: విధి నిర్వహణలో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న జర్నలిస్టులపై డ్యూటీలో ఉన్న వైద్యురాలు అనుచితంగా ప్రవర్తించిన విధానాన్ని నిరసిస్తూ మంగళవారం చీరాల జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ సోమవారం రాత్రి జరిగిన ఓ దాడి ఘటనలో గాయాలపాలైన వ్యక్తికి సంబంధించి, రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మరో మహిళ వార్త కవర్ చేయడానికి జర్నలిస్టులు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యురాలు వారిని లోపలికి రానీయకుండా సమాచారాన్ని సేకరించనీయకుండా తలుపులు వేయించి అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. జర్నలిస్టులు తమ విధుల నిర్వహణలో సమయపాలనంటూ లేకుండా ఏ సమయంలో పడితే ఆ సమయంలో కష్టపడుతుంటారని అటువంటి జర్నలిస్టులపై వైద్యురాలు అనుచితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం గళమెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే పత్రికా విలేకరులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వారు సూచించారు. తక్షణమే వైద్యురాలిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సుభాషిణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ప్రభాకర్, చందు, బాషా, ప్రదీప్‌లు గురునాథం, రాజేష్, దిలీప్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

చీరాల అర్బన్: పట్టణంలోని విద్యుత్ కనెక్షన్లపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చీరాల ఈఈ కె.జాన్ థామస్ అధ్వర్యంలో చీరాల డివిజన్ విద్యుత్ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు మొత్తం 34 బృందాలుగా తనిఖీ చేపట్టారు. మొత్తం 2803 మీటర్లను తనిఖీ చేయగా 159 కేసులు నమోదు చేశారు. అలానే రూ.7.75 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ తెలిపారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, అక్రమంగా గాని, అధిక లోడు విద్యుత్ వాడకం కూడా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.ఆంజనేయులు, చీరాల డీఈఈ హరిప్రసాద్‌రావు, వేటపాలెం డీఈఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈఈ ఎన్.రమేష్‌బాబు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


చీరాలలో వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చినగంజాం: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి చినగంజాం శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఏఎంఎల్ నరసింహాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ బాలల దినోత్సవం, 15వ తేదీ పుస్తక ప్రదర్శన, 16వ తేదీ చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతి విద్యార్థులకు అంతరిక్షంపై చంద్రయాన్–3 ప్రయోగంపై వ్యాసరచన పోటీలు, 17వ తేదీ కవి సమ్మేళనం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18వ తేదీ కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, 19వ తేదీ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు, 20వ తేదీ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ..

చీరాల అర్బన్: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ ఎ.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఈఓఆర్డీ ఎ.శ్రీనివాస్ తదితరులు ఆవిష్కరించారు. వారం రోజులు పాటు గ్రంథాలయంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, చెస్, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనాలని లైబ్రేరియన్ డీధనమ్మ తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ కృష్ణమూర్తి, ఎస్.సుబ్బరామయ్య, ఇమ్మానియేలు, మున్నీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల అర్జీల్లో అలసత్వం తగదు

మేదరమెట్ల: భూసమస్యలపై వచ్చిన అర్జీల్లో అధికారులు అలసత్వం వహించకూడదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. కొరిశపాడు మండలం కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజాసమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రీ సర్వే భూములకు సంబంధించిన పలు సమస్యలపై రైతులు ఆర్డీవోకు వినతి పత్రాలను అందచేశారు. భూములకు సంబంధించి అక్రమ లేఅవుట్లపై వీఆర్‌వోలు కచ్చితంగా వ్యవహరించాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని ఆర్డీవో హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మీ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

స్వర్ణ (కారంచేడు): ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన సిమెంట్ బల్లలు గ్రామానికి చెందిన దాతల ద్వార సమకూర్చడం అభినందనీయమని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం శాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో గ్రామానికి చెందిన నల్లమల్లి పేరయ్య, తులశమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు నల్లమల్లి నరశింహారావు, అన్నపూర్ణ దంపతులు ఆసుపత్రికి ఆరు సిమెంట్ బల్లలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ హస్మప్రియ, ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరారవు, మాలెంపాటి సత్యన్నారాయణ, టీ ఆదినారాయణ పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ తప్పనిసరి

చీరాల టౌన్: పొదుపు మహిళలు మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించాలని వెలుగు ఏపీఎం మధుబాబు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.